
సాక్షి
తిరుపతి
శనివారం । 2 । డిసెంబర్ । 2023



సప్తగిరుల ప్రదక్షిణ అసాధ్యం

తిరుమల అన్నమయ్యభవన్‌లో శుక్రవారం నిర్వహించిన డయల్‌యువర్ ఈఓలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి పాల్గొన్నారు. - 8లో



ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయం

చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్లు తుడా చైర్మన్ తెలిపారు. - 8లో



పక్కాగా ఓటరు జాబితా

ఓటరు జాబితాను పక్కాగా స్వచ్ఛీకరించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఎన్నికల అధికారులను ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

ఆగమోక్తంగా 'సంకట చతుర్దశి'



హోమ పూజల్లో ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలోని అంజి అంజి వినాయకస్వామి గుడి వద్ద శుక్రవారం ఆగమోక్తంగా సంకట చతుర్దశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా గణపతి హోమం జరిపించారు. అనంతరం స్వామివారికి అభిషేకం చేపట్టి, విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి గణనాథుని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'చెబుదాం'



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్‌డీఓ రవికుమార్

కేవీబీపురం : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్‌డీఓ రవికుమార్ తెలిపారు. శుక్రవారం కేవీబీపురం ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా స్థాయి 'జగనన్నకు చెబుదాం' చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వివిధ సమస్యలపై సుమారు 130 వినతులు సమర్పించారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ ప్రతీ అర్జీని జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఎంపీడీఓ రామచంద్ర, డీఈ దామోదర్‌నాయుడు, తహసీల్దార్ శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, స్థానిక నేతలు నందకుమార్, లాల్‌బాబు యాదవ్, మూర్తి సుబ్బయ్య, చిరంజీవి, మోహన్‌నాయుడు పాల్గొన్నారు.

సచివాలయాలకు క్రీడాసామగ్రి



క్రీడాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

తిరుపతి రూరల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం కోసం క్రీడాసామగ్రిని ఆయా సచివాలయాలకు శుక్రవారం చేరాయి. ఈ నెల 15వ తేదీ నుంచి సచివాలయాల స్థాయి పోటీలు ప్రారంభించనున్న నేపథ్యంలో తిరుపతి రూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సచివాలయాల వారీగా పంపిణీ చేశారు. ఒక్కో సచివాలయానికి మూడు క్రికెట్ కిట్లు, బాడ్మింటన్ నెట్, బాడ్మింటన్ రాకెట్లు–6, బాడ్మింటన్ నైలాన్ కాక్స్–3 బాక్సులు, వాలీబాల్–3, వాలీబాల్ నెట్–1, టెన్నికాయిట్–2 అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధృఢత్వమే కాకుండా మనోవికాసం పెరుగుతుందన్నారు. ఆడుదాం...ఆంధ్రాలో పాల్గొనేందుకు ఇప్పటికే పెద్దసంఖ్యలో యువతీయువకులు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని, ఈనెల 15 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ గిరిధర్ రెడ్డి, పరిపాలనాధికారి పిచ్చిరెడ్డి, వాసుదేవరాజు, ప్రసాద్, శరత్‌బాబు పాల్గొన్నారు.

జిల్లా మత్స్యశాఖాధికారిగా నాగరాజు



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగరాజు

తిరుపతి అర్బన్ : జిల్లా మత్స్యశాఖాధికారిగా నాగరాజు శుక్రవారం తిరుపతిలోని తమ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాస్ నాయక్ అనంతపురం జిల్లాకు బదిలీ కావడంతో ఎన్టీఆర్ జిల్లా నుంచి నాగరాజుకు ఆయన బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు. నాగరాజు మాట్లాడుతూ మత్స్యశాఖ సొసైటీలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఇదివరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా మత్స్యశాఖ డీడీగా పనిచేసిన క్రమంలో ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. మత్స్యకారుల అభ్యున్నతికి సహకారం అందిస్తామని వెల్లడించారు. ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్‌లను ప్రజలకు మరింత చేరువ చేస్తామని చెప్పారు. రూ.లక్ష నుంచి రూ.50లక్షల మేరకు అందిస్తున్న రుణాలను అర్హులందరికీ ఇప్పించేందుకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

- శ్రీకాళహస్తికి చెందిన మునిరాజమ్మ అనే మహిళ రాజీవ్‌నగర్ కాలనీలో స్థలం ఆక్రమించుకుని ఇల్లు కట్టుకునేందుకు ప్రయత్నించింది. అయితే ఆ స్థలం ఆమెది కాకపోవటంతో రెవెన్యూ వారు అడ్డుకున్నారు. అయితే వీఆర్‌ఓ లంచం అడిగితే ఇవ్వకపోవడం వల్లే అడ్డుకున్నారని సదరు మునిరాజమ్మతో టీడీపీ నేతలు ప్రచారం చేయించారు. దీని వెనుక స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హస్తం ఉందంటూ బురదజల్లేందుకు యత్నించారు. దీనిపై రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి విచారించగా.. ఆ స్థలం ఆమెది కాదని తేలడంతో టీడీపీ శ్రేణులు, మునిరాజమ్మ గప్‌చుప్ అయ్యారు. ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిందలు మోపి దుష్ప్రచారం చేసినందుకు గాను టీడీపీ నేతలు ఆమెకు రూ. 5లక్షలు బహుమతిగా ఇచ్చినట్లు తెలిసింది.

- పూతలపట్టు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన నాగరాజునాయుడు టీడీపీ సానుభూతిపరుడు. అతడికి భార్య పావని, పిల్లలు మోహిత్, తేజ ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పలు పథకాల ద్వారా నాగరాజు కుటుంబం రూ.1,67,474 లబ్ధిపొందింది. ఇందులో వైఎస్సార్ ఆసరా కింద రూ.27,621, అమ్మ ఒడి రూ.55,000, సున్నావడ్డీ 6,933, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద రూ.64,420, రైతు భరోసా రూ.13,500ల చొప్పున్న ఫలాలు దక్కాయి. అయితే నాయకుడి మెప్పు కోసం ప్రభుత్వ పథకాలపై తప్పుడు ప్రచారం మొదలు పెట్టారు. తీరా అధికారులు లెక్కలతో సహా బయటపెట్టడంతో ఆ వ్యక్తి బిక్కమొహం వేశాడు.

- చిత్తూరు మండలంలో రెండు కుటుంబాల మధ్య గత కొన్నేళ్లుగా భూ సమస్య ఉంది. ఇందులో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మధ్యవర్తిగా తలదూర్చి గొడవ సృష్టించాడు. వారు కొట్టుకునేలా చేశాడు. తీరా పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాల వారి చేత ఫిర్యాదు చేయించాడు. మళ్లీ అతనే వెళ్లి పంచాయితీ పెట్టించాడు. తాను పోలీసుల ఇన్ఫార్మర్ అంటూ ఇరు వర్గాల వద్ద రూ. 10 వేలు వసూలు చేసి తానే పెద్ద మనిషిగా వ్యవహరించాడు. ఇద్దరినీ ఒప్పించి సర్దుబాటు చేశాడు. కానీ డబ్బులు తీసుకున్న విషయం బయటపడడంతో గ్రామస్తులు నోళ్లు నొక్కుకుంటున్నారు.

పల్లెల్లో.. పచ్చ కుట్రలు!



- సామాన్య ప్రజలను రెచ్చగొట్టడమే పని
- సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారం
- మట్టి, ఇసుక అక్రమ రవాణా అంటూ విషం కక్కుతున్న తమ్ముళ్లు
- అమాయకులను ఉసిగొల్పుతూ.. ప్రభుత్వంపై బురదజల్లే యత్నం

సాక్షి, తిరుపతి : ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తమకు అండగా ఉండే ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలకు తెరతీశారు. అర్హత ఉన్నా ప్రభుత్వ పథకాలు అందడం లేదంటూ విషం కక్కుతున్నారు. సామాన్య జనాన్ని రెచ్చగొట్టి వీధుల్లోకి లాగుతున్నారు. స్థానికుల మధ్య వివాదాలు సృష్టించి.. వీటిని వైఎస్సార్‌సీపీ నాయకులకు అంటగట్టి రాక్షసానందం పొందుతున్నారు. చంద్రబాబు, లోకేష్‌ని స్ఫూర్తిగా తీసుకుని టీడీపీ నేతలు, కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. పథకాలకు అనర్హులుగా ఉన్నవారికి లేనిపోనివి చెప్పి రెచ్చగొడుతున్నారు. వారి ద్వారా ప్రభుత్వంపై బురదజల్లుతున్నారు. ఎలాగైనా ప్రజలు పచ్చమాయలోకి దించాలని పన్నాగం పన్నుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలు పెద్ద ఎత్తున మట్టి, ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారంటూ ఎల్లోమీడియా సహకారంతో టీడీపీ నేతలు రోజూ ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇక్కడ జరిగేది వేరు. పూతలపట్టు– నాయుడుపేట జాతీయ రహదారి ఆరు లేన్ల విస్తరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో మెగా కంపెనీ క్యూబిక్ మీటర్‌కు రూ.240 చెల్లించి మట్టి వాడుకుంటోంది. జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల పక్కాగృహాల నిర్మాణానికి ఇసుక అవసరం అనేది అందరికీ విధితమే. పక్కాగృహాలు నిర్మించుకునే వారికి సర్కారే ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తోంది. అయితే లబ్ధిదారులకు సరఫరా చేసే ఇసుకను కూడా అక్రమ రవాణా అంటూ ఎల్లో మీడియాతో కలసి టీడీపీ దుష్ప్రచారం చేయిస్తోంది.

ఆదరణ చూసి ఓర్వలేక

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10.40 లక్షల కుటుంబాలు ఉండగా, అర్హతను బట్టి నవరత్న పథకాలు ప్రతి ఇంటి తలుపూ తడుతున్నాయి. నిర్ణీత సమయానికి సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకే జమవుతున్నాయి. పలువురు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థిక ఎదుగుదలకు బాటలు వేసుకున్నారు. పథకాల అమలులో అవినీతికి తావులేకుండా పారదర్శకతకు పెద్దపీట వేశారు. ప్రభుత్వ సేవలు సైతం పల్లె ముంగిటకు వచ్చాయి. దీంతో గ్రామీణులు సైతం పట్టణాలు, మండల కేంద్రాలకు ప్రదక్షిణలు చేసే పనిలేకుండా ఉన్న ఊర్లోనే అని సేవలు పొందుతున్నారు. ఎవరెవరు ఏయే పథకాలకు అర్హులో వలంటీర్లే గుర్తించి దరఖాస్తు చేయించి పథకాలు ఇంటికే చేరుస్తున్నారు. ప్రభుత్వ పథకాలతో పాటు ఇంటి స్థలం, భూ పంపిణీ వంటి వాటిని అందజేస్తున్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలకు సైతం నవరత్న పథకాలు ఇంటికే చేరుతుండటంతో అవాక్కవుతున్నారు. టీడీపీ శ్రేణుల్లో ఎక్కువ మంది జగనన్నకు జైకొడుతున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలు, పథకాల అమలులో జన్మభూమి కమిటీ పెత్తనం మళ్లీ మాకొద్దంటున్నారు. ఈ పరిణామాలను జీర్ణించుకోలేని పచ్చ బ్యాచ్ పల్లెల్లో చిచ్చుపెడుతోంది. గ్రామీణస్థాయిలో బలంగా ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులపై తప్పుడు ప్రచారం చేయిస్తోంది. పోలీసు స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాల్లో మేం చెప్పిందే వేదమంటూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వ పథకాలు మీకు ఇవ్వరంటూ అనర్హులను రెచ్చగొడుతూ సమస్యలు సృష్టిస్తోంది. రచ్చ చేసి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకుంది.



పుంగనూరుకు మంచి రోజులు



అరడిగుంట వద్ద భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఈఓ ఆండ్రియాస్ హేగర్, కంపెనీ ప్రతినిధులు

- జర్మన్ కంపెనీ బృందం పరిశీలన
- ఎదురుచూసిన జనం
- మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌ల కృషి

పుంగనూరు: పుంగనూరుకు మంచిరోజులొచ్చాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అంతర్జాతీయ ఖ్యాతి దక్కించుకోబోతోంది. ఒకప్పుడు మహానగరాలకే పరిమితమైన పరిశ్రమలు ఇప్పుడు పుంగనూరులో పెట్టేందుకు ఇక్కడికి వచ్చి వాలిపోతున్నాయి. రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సొంత నియోజకవర్గం పారిశ్రామికాభివృద్ధి బాటపట్టింది. పుంగనూరు ఉపాధి కల్పన కేంద్రంగా మారడంతో మంచి రోజులు వచ్చాయంటూ జనం సంబరాలు చేసుకుంటున్నారు

పుంగనూరులో ఏర్పాటు అదృష్టం

పెప్పర్ మోషన్ కంపెనీ సీఈఓ శుక్రవారం కలెక్టర్ షణ్మోహన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ బస్సుల తయారీ సంస్థ స్థాపనకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆండ్రియాస్ హేగర్, సీటీఓ డాక్టర్ మదియాస్ కెర్లర్, సీఎస్ఓ సత్య, ఫైనాన్స్ డైరెక్టర్ ఉవే స్టెల్డర్, నాఉర్ద్ ఎలక్ట్రిక్ ఎండీ హర్ష ఆద్యా, పెప్పర్ సీఈఓ రాజశేఖర్‌రెడ్డి, సీఎస్ఓ సత్యబులుసు, సీసీఓ రవిశంకర్‌తో కలసి ఆరడిగుంట, వనమలదిన్నె, మేలుందొడ్డి గ్రామాల్లో కేటాయించనున్న 800 ఎకరాల భూమిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో మంచినీరు, విద్యుత్, పుష్కలంగా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కర్ణాటక, తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన పుంగనూరు వ్యాపార లావాదేవీలకు అనువైన ప్రాంతం అని అభివర్ణించారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కోరిక మేరకు ఇక్కడ కంపెనీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుమారు 10 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. ఫిబ్రవరిలోపు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కంపెనీ ప్రతినిధులు వస్తున్నారన్న సమాచారం తెలియడంతో ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మనోజ్‌రెడ్డి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్‌తో కలసి సీఈఓ, కలెక్టర్, కంపెనీ ప్రతినిధులకు ఘన స్వాగతం పలికి, శ్యాలువలతో సత్కరించారు. సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లె చెంగారెడ్డి, సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యదర్శులు చంద్రారెడ్డి యాదవ్, దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిరుద్యోగులకు ఉపాధి

పడమటి నియోజకవర్గమైన పుంగనూరు మండలంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన జర్మన్ పెప్పర్ ఎల్‌క్ట్రికల్ బస్సుల కంపెనీ ఏర్పాటు చేయడం జిల్లా చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ రోజని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కొనియాడారు. కంపెనీ ప్రతినిధులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి చొరవతో పరిశ్రమ ఏర్పాటు అవుతోందన్నారు. నిరుద్యోగులు ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా ఇక్కడే సుమారు 8 వేల మందికి ఉపాధి లభిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. స్థానిక ప్రజలు సహకరించాలని కోరారు.



పెప్పర్ కంపెనీ సీఈఓను సన్మానిస్తున్న నేతలు

అభివృద్ధిని అడ్డుకోవడం బాబు నైజం



బోనమంద సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- బోనమంద సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సభకు హాజరైన ప్రజలు

సోమల: అభివృద్ధిని అడ్డుకోవడం చంద్రబాబు నైజం అని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పేటూరు పంచాయతీ బోనమందలో సర్పంచ్ విమల, ఎంపీటీసీ సభ్యురాలు సర్వేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ పడమటి మండలాలైన సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పీలేరు ప్రజలకు తాగు, సాగు నీరు అందించడానికి ఆవులపల్లె వద్ద సీతమ్మ చెరువు రిజర్వాయర్ నిర్మిస్తుండడం జీర్ణించుకోలేని టీడీపీకి చెందిన నాయకులు గత ప్రభుత్వాల్లో కబ్జా చేసిన అటవీ భూముల్లో సాగు చేసిన మామిడి తోటలు పోతాయని చంద్రబాబు ప్రొద్బలంతో కేసులు వేసి, ఆపేశారని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రైతులు, ప్రజలకు త్వరలోనే కోర్టు ద్వారా విజయం సాధించి పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు 100 పేజీల మేనిఫెస్టోలో 600 హామీలను ఇచ్చారని, వాటిలో ఒక్క హామీనైనా నేరవేర్చారా? అని ప్రశ్నించారు. బ్యాంకులో ఉన్న బంగారం తాను అధికారంలో వస్తే ఆడబిడ్డల ఇంటికి వస్తుందని హామీ ఇచ్చారని, అవి వచ్చాయా? అని అడిగారు. ఆ రుణాలను జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే మూడు దఫాలుగా ఆసరా పథకం ద్వారా అందించామన్నారు. జనవరిలో నాలుగో విడత నగదు అందజేస్తే మీ అప్పు తీరుతుందని వివరించారు. ప్రజలు ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు గంగాధరం, ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు నాగభూషణం రెడ్డి పాల్గొన్నారు.



ముక్కంటి ఆలయం కార్తీక కాంతులతో విరాజిల్లుతోంది. వాయులింగేశ్వరుని సన్నిధి దివ్యతేజంతో అలరారుతోంది. ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయ కమిటీ పవిత్ర శివలింగార్చనకు శ్రీకారం చుట్టింది. సుమనోహర సుమాలతో పరమేశ్వరుని లింగాకృతిని తీర్చిదిద్దింది. వేదమంత్రోచ్ఛారణ నడుమ దీపోత్సవం చేపట్టింది. – శ్రీకాళహస్తి

నూతన ఆవిష్కరణలతో కలల సాకారం



విద్యార్థులతో డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు: విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవాలని, నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం మేర్లపాక రెవెన్యూలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో సివిల్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ విభాగం, ప్లాస్టిక్ ఫైబర్ కార్పొరేషన్, స్వాన్ సైంటిఫిక్ సహకారం(డాక్టర్ నిప్పట్లపల్లి నరసమ్మ)తో 'సుస్థిర వ్యర్థజలాల నిర్వహణ, ఆధునాతన చికిత్స యొక్క పాత్ర' అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాపు జరిగింది. డైరెక్టర్ మాట్లాడుతూ వాటర్ క్యారెక్టరైజేషన్, వాటర్ రిసోర్స్ రికవరీ, నానో టెక్నాలజీలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం, నిజజీవితంలో ఈ పద్ధతులు, సాంకేతికతకు సంబంధించిన ఆచరణాత్మక అంశాలను వివరించారు. కార్యక్రమంలో నిప్పట్లపల్లి నరసమ్మ , డీన్ వెంకయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత అవసరం

తిరుపతి సిటీ : విద్యార్థులకు చదువు, క్రమశిక్షణతో పాటు సామాజిక బాధ్యత అవసరమని వేదిక్ వర్సిటీ వీసీ ఆచార్య రాణి సదాశివమూర్తి తెలిపారు. శుక్రవారం వర్సిటీలో 3 రోజులపాటు నిర్వహించనున్న స్టూడెంట్స్ ఇండక్షన్ (ప్రేరణ) ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదాల్లోని గొప్ప వైజ్ఞానిక అంశాలను మానవావళికి అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా వినియోగించుకోవాలి అనే విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. డాక్టర్ కేహెచ్ రాజేష్ కుమార్, ఆచార్య రామకృష్ణ సోమయాజీ, డాక్టర్ నందనరావు, డాక్టర్ డీఎస్ఆర్ ఎల్ఎన్ శాస్త్రి, అకడమిక్ డీన్ గోలి సుబ్రమణ్యశర్మ, డాక్టర్ ఉమేష్ భట్, డాక్టర్ నీలకంఠం, డాక్టర్ మధుబాబు, డాక్టర్ భరత్ శేఖర్, పీఆర్ఓ డాక్టర్ బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి అర్బన్ : ప్రభుత్వ ప్రాధాన్యతా పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీ గురుమూర్తి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రివ్యూ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణులకు ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, కిసాన్ క్రెడిట్ కార్డ్, ముద్ర యోజన, జనధన్ యోజన, జీవన జ్యోతి బీమా యోజన తదితర పథకాలపై బ్యాంకర్లు అవగాహన కల్పించి ఎక్కువ రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఎడ్యుకేషన్, ఎంఎస్ఎంఈలకు ప్రాధాన్యమిస్తూ రుణాలు అందించాలని కోరారు. నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ బ్యాంక్ లింకేజీ, జగనన్న తోడు, జగనన్న పాల వెల్లువ లబ్ధిదారులకు వెంటనే రుణాలు అందేలా బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ కింద సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ క్యాంపెయిన్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా బ్యాంకర్ల భాగస్వామ్యం ఉండాలని కోరారు. సమావేశంలో ఇండియన్ బ్యాంక్ ఏజీఎం రాజేష్, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, నాబార్డ్ డీడీఎం సునీల్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ వన మహోత్సవం రేపు

తిరుపతి కల్చరల్ : తిరుపతి బ్రాహ్మణ సమాజంలో ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీత్యాగరాజ మండపంలో కార్తీక వనమహోత్సవం నిర్వహించనున్నట్లు సమాజం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీ, కొత్తపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తిరుపతి బ్రాహ్మణ సమాజం కార్యాలయంలో కార్తీక వన మహోత్సవం కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కార్యక్రమానికి జాతీయ సంస్కృత వర్సిటీ కులపతి ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి, వేదిక్ వర్సిటీ ఉప కులపతి రాణి సదాశివ మూర్తి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు వివరించారు. జిల్లాలోని బ్రాహ్మణులందరూ రావాలని కోరారు.

క్లుప్తంగా

విశ్వంలో ఉచిత నమూనా పరీక్ష రేపు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్లో ఆదివారం ఉదయం 9గంటలకు సైనిక్, నవోదయ, మిలటరీ పాఠశాల ఎంట్రన్స్ టెస్ట్‌కు సంబంధించి నమూనా పరీక్ష, అవగాహన సదస్సును ఉచితంగా నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ మేరకు విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. నమూనా పరీక్ష, అవగాహన సదస్సులో ప్రస్తుతం 4నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనవచ్చని తెలిపారు. వీరికి ఆయా పోటీ పరీక్షలకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేయడంతో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 93999 76999, 86888 88802 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బ్యాంక్ అప్రైజర్ అరెస్ట్

కోట : చిట్టేడు సిండికేట్ బ్యాంక్ అప్రైజర్ అంకయ్యను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పుల్లారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చిట్టేడు సిండికేట్ బ్యాంక్‌లో ఈ ఏడాది ఆగస్ట్‌లో బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్న కొందరు నగదు లావాదేవీల్లో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదు చేయడంతో బ్యాంకు అధికారులు విచారణ చేపట్టారన్నారు. రూ.లక్షల్లో గోల్‌మాల్ జరిగినట్లు గుర్తించి, అప్పటి బ్యాంక్ మేనేజర్ నందగోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని వెల్లడించారు. బ్యాంక్‌లో అప్రైజర్‌గా పనిచేసే అంకయ్య అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో అరెస్ట్ చేసినట్లు వివరించారు.

IN THE COURT OF THE V[th] ADDITIONAL JUNIOR CIVIL JUDGE-TIRUPATI

O.S.No.1187 of 2022

Between :
IDBI Bank Ltd, Tirupati, Rep by its Branch Head holding office at Harsha Towers, AIR By-Pass Road, Annamayya Circle, Tirupati .... **Plaintiff**
And
M/s. Lakshmi Travels & Another .... Defendants
Notice to Defendants
To
Defendant No.1 : M/s.Lakshmi Travels, Rep by its Proprietor Smt.Lakshmi Bai, W/o.B.Harikrishna Naik, D.No.2-430, Kotha Cherlopalle, Tirupati Rural Mandal, Tirupati District.
Defendant No.2 : Smt.B.Lakshmi Bai, W/o. B.Harikrishna Naik, D.No.2-430, Kotha Cherlopalle, Tirupati Rural Mandal, Tirupati District.
Sir,
Please Take Notice that the above suit i.e., **O.S.1187 of 2022 is Posted to 18-12-2023** for your appearance. you are therefore directed by this Hon'ble court to attend on **18-12-2023 at 10.30 Am** and represent the matter either in person (or) through your advocate. Failing which the matter will be decided exparte.
By order of the Court.
Sri.L.Madhusudhan Reddy, B.Sc., B.L.
Advocate, Tirupati, Cell No.9848175467

సప్తగిరుల ప్రదక్షిణ అసాధ్యం

- డయల్ యువర్ ఈఓలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి


మాట్లాడుతున్న ఈఓ ధర్మారెడ్డి

తిరుమల : తిరువణ్ణామలై, మధురలో ఒక కొండ మాత్రమే ఉందని, తిరుమల క్షేత్రం సప్తగిరులపై వెలసిందని, కావున గిరి ప్రదక్షిణ సాధ్యం కాదని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి స్పష్టం చేశారు. అయితే తిరుమల ఇన్నర్‌రింగ్‌రోడ్డు, ఔటర్‌రింగ్ రోడ్డు ద్వారా భక్తులు శ్రీవారి ఆలయ ప్రదక్షిణ చేయవచ్చని సూచించారు. శుక్రవారం తిరుమల అన్నమయ్య భవన్లో నిర్వహించిన డయల్ యువర్ ఈఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తిరుపతికి చెందిన ఈశ్వర్ అనే భక్తుడు మాట్లాడుతూ అలిపిరిలోని సప్తగోప్రదక్షిణ మందిరంలో శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమాన్ని అద్భుతంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. ఈ క్రమంలో మరికొందరి భక్తుల ప్రశ్నలకు ఈఓ సమాధానమిచ్చారు.

వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు ఎప్పటి నుంచి ఇస్తారు. - శ్రీనివాస్, ప్రొద్దుటూరు

ఈఓ : డిసెంబర్ 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు 4.25 లక్షల టికెట్లు జారీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రసాదంతోపాటు అక్షింతలు కూడా ఇవ్వండి. విశాఖపట్నంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొనే అవకాశం కల్పించండి. - అప్పన్న, వైజాగ్

ఈఓ : శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులకు అక్షింతలు అందజేస్తున్నాం. దర్శనానంతరం అక్షింతలు అందించే విషయమై ఆగమ సలహామండలితో చర్చిస్తాం. విశాఖపట్నంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొనే అవకాశాన్ని త్వరలోనే కల్పిస్తాం.

వరంగల్‌లోని పురాతన శ్రీరంగనాథ స్వామి ఆలయ జీర్ణోద్ధరణకు టీటీడీ తరఫున సహకారం అందించండి. - విజయలక్ష్మి, హైదరాబాద్

ఈఓ : శ్రీవాణి ట్రస్ట్ నుంచి సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

వైకుంఠ ఏకాదశికి తిరుమల, తిరుపతిలో గదులను ఆన్‌లైన్‌లో విడుదల చేయలేదు. లక్కీడిప్ టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయండి. వృద్ధులు, వికలాంగులతోపాటు ఒక సహాయకుడిని అనుమతించండి. - శంకర్ గౌడ్, హైదరాబాద్

ఈఓ : డిసెంబరు 23, 24వ తేదీలకు గదుల అడ్వాన్స్ రిజర్వేషన్ లేదు. తిరుమల సీఆర్ఓ కార్యాలయం వద్ద పేర్లు నమోదు చేసుకుని గదులు పొందవచ్చు. ఆన్‌లైన్‌లో లక్కీడిప్ సేవా టికెట్లు ఇవ్వడం వీలుకాదు.

25 ఏళ్ల ముందే దూరదృష్టితో ఆలయ మాడ వీధులను విస్తరించి అద్భుతంగా తీర్చిదిద్దినందుకు అభినందనలు. ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టుకు ప్రత్యేకాధికారిని నియమించండి. ధనుర్మాసంలో తిరుప్పావై ప్రవచన కార్యక్రమాలను చేపట్టండి. - ధనుంజయ్, చెన్నై

ఈఓ : 2004- 06 ఏళ్లలో తిరుమలలోని నాలుగు మాడ వీధులను విస్తరించి, గ్యాలరీలు ఏర్పాటు చేశాం. ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టుకు కాంట్రాక్టు పద్ధతిలో అధికారి ఉన్నారు. ధనుర్మాసంలో 30 రోజులు పాటు 30 పాశురాలను అర్థతాత్పర్యాలతో పెద్దజీయర్ మఠం నుంచి ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నాం.

తిరుమలలో లగేజీ కౌంటర్ల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వలేదని బ్యాగ్‌లు విసిరేస్తున్నారు. - కుమార్, రాజమండ్రి

ఈఓ : ఇలాంటి విషయాల్లో భక్తులు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం

తిరుమల నాదనీరాజనం వేదికపై సంకీర్తనలు పాడేందుకు అవకాశం కల్పిస్తున్నారు. అలాగే శ్రీవారి గర్భగుడిలో గాయకులకు పాడే అవకాశం కల్పించండి. - విశ్వనాథ్, బెంగళూరు

ఈఓ : శ్రీవారి ఆలయంలో వేద పారాయణం మాత్రమే ఉంటుంది. ఏకాంత సేవలో మాత్రమే అన్నమయ్య సంకీర్తనలు ఆలపించడం జరుగుతుంది. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ సదా భార్గవి, సీవీఎస్ఓ నరసింహ కిషోర్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ–2 జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయం

- రాతి మండపాల నిర్మాణ పనులు ప్రారంభించిన తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి


పనులు ప్రారంభిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

చంద్రగిరి : ఆధ్యాత్మికత ఉట్టిపడేలా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మూలస్థాన ఎల్లమ్మ ఆలయాన్ని పునర్నిర్మాణం చేపట్టినట్లు తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో రాతి మండపాల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ పురాతన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో జీర్ణోద్ధరణకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ఇందుకోసం భక్తులు రూ.1.52 కోట్లు, తుడా రూ.1.25కోట్లు, టీటీడీ రూ.3.88కోట్లు, దేవాదాయశాఖ రూ.కోటి మొత్తం రూ.7కోట్లు వెచ్చించి పునర్నిర్మిస్తున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నేతృత్వంలో ఇప్పటికే ఆలయ ఆవరణలో అనేక అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ఆలయాలు, పంచాయతీల అభివృద్ధికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. రాష్ట్రంలోనే చంద్రగిరిని అన్ని రంగాల్లో రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దారని తెలిపారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి సహకారంతో భక్తుల సౌకర్యార్థం నూతన రహదారి నిర్మించనున్నట్లు వెల్లడించారు. సుమారు రూ.40లక్షల వ్యయంతో 40 అడుగుల రోడ్డును అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. మరో మూడు నెలల్లో అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యుగంధర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డికి నివాళి


సుదర్శనరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి


పుష్పాలంజలి ఘటిస్తున్న ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మంత్రి ఆర్కే రోజా సోదరుడు కుమారస్వామిరెడ్డి, జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే హేమలత తదితరులు ఘనంగా నివాళులర్పించారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి తండ్రి సుదర్శనరెడ్డి గురువారం ఉదయం చెన్నై అపోలో ఆస్పత్రిలో కన్నుమూశారు. ఈ క్రమంలో శుక్రవారం నారాయణవనానికి ప్రముఖులు వేర్వేరుగా వెళ్లి సుదర్శనరెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మంచి సహచరుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ ఎంపీపీగా, డీసీసీబీ డైరెక్టర్‌గా సుదర్శనరెడ్డి ఎనలేని సేవలందించారని వెల్లడించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు అమ్ములు, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, గవర్ల కృష్ణయ్య, అపరంజిరాజు, పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి, వడమాలపేట జెడ్పీటీసీ సభ్యుడు మురళీరెడ్డి, నింద్ర ఎంపీపీ దీపా జలందర్‌రాజు ఉన్నారు.

అంతర్గత భద్రతపై అవగాహన


అధ్యాపకులు, విద్యార్థులతో ఆక్టోపస్ ఎస్పీ రవిచంద్ర

తిరుపతి సిటీ : తిరుపతి ఎమ్మార్‌పల్లె సర్కిల్ వద్ద డాక్టర్ గిండీస్ ఐఏఎస్ అకాడమీలో శుక్రవారం ×అంతర్గత భద్రత× అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆక్టోపస్ విభాగం) ఎస్పీ బల్లి రవి చంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దేశ అంతర్గత భద్రత విషయంలో పోలీస్‌శాఖలోని వివిధ విభాగాల పని తీరును వివరించారు. రాయలసీమ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు తమ మిత్రుడు డాక్టర్ సురేష్ కుమార్ అకాడమీని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతిలో సివిల్స్, గ్రూప్స్, బ్యాంకు జాబ్స్ వంటి పలు ప్రభుత్వ ఉద్యోగార్థులకు శిక్షణను ఇచ్చేందుకు అతి తక్కువ ఫీజుతో అన్ని వసతులతో అకాడమీ నడుస్తోందని వెల్లడించారు. అనంతరం సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు సంబంధించిన సైన్స్ అండ్ టెక్నాలజీ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ డాక్టర్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

పాంచరాత్ర ఆగమం..భగవతారాధనకు విశిష్టం


శ్రీశఠగోప రామానుజ జీయర్ స్వామి వారికి స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

తిరుచానూరు(చంద్రగిరి): పాంచరాత్ర ఆగమం ద్వారా భగవంతుని లీలావిశేషాలను అవగతం చేసుకోవచ్చని, ఆలయ కైంకర్యాలకు ఇది మార్గదర్శకంగా నిలుస్తోందని మేల్కొటేకి చెందిన శ్రీ శఠగోప రామానుజ జీయర్ స్వామి ఉద్ఘాటించారు. శుక్రవారం తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం వద్దగల ఆస్థానమండపంలో అఖిల భారత భగవత్‌శాస్త్ర పాంచరాత్ర ఆగమ విద్వత్ సమ్మేళనం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ పాంచరాత్ర ఆగమంలో భగవదారాధన ఎంతో విశేషమైనదన్నారు. తిరుమల ధర్మగిరి వేద పాఠశాల పండితులు అనంత వెంకట దీక్షితులు మాట్లాడుతూ నిగూఢమైన విషయాలను వేద, ఆగమ విద్యార్థులు అవగాహన చేసుకుని, పాంచరాత్ర ఆగమాన్ని విశ్వవ్యాప్తం చేయాలని కోరారు. శ్రీరంగం శ్రీపాంచరాత్ర ఆగమ సంరక్షణ సభ నిర్వాహకులు శ్రీరామభట్టర్ మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచానికి అవసరమైన ఎన్నో విషయాలు పాంచరాత్ర ఆగమంలో ఉన్నాయని తెలిపారు. టీటీడీ పాంచరాత్ర ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఆగమ పండితులు చిలకమర్రి తిరుమలాచార్యులు, బాలాజీ భట్టర్, పరకాల స్వామి పాల్గొన్నారు.

అతివేగంతో ప్రాణాలకే ముప్పు


అవగాహన కల్పిస్తున్న ఎంబీఏ కుసుమ

తిరుపతి మంగళం: వాహనాలను అతివేగంగా నడిపి ప్రమాదాలబారిన పడొద్దని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కుసుమ విద్యార్థులకు సూచించారు. తిరుపతిలోని నారాయణ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం రోడ్డు ప్రమాదాలపై ఆమె అవగాహన కల్పించారు. ఇటీవల విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్నారని తెలిపారు. ప్రతిఒక్క విద్యార్థి రవాణాశాఖ నిబంధనలను పాటించాలని చెప్పారు.

ఆక్టోపస్ దళం మాక్ డ్రిల్


మాక్ డ్రిల్‌లో ఆక్టోపస్ దళం, ఆలయ అధికారులు, పోలీస్ సిబ్బంది

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం ఆక్టోపస్ దళం మాక్ డ్రిల్ నిర్వహించింది. ఉగ్రవాదులు చొరబడితే ఎలా ఎదుర్కోవాలి? భక్తుల ను ఎలా రక్షించాలి? అనే దాని పై ఈ డ్రిల్ చేశారు. ఆక్టోపస్ దళాలు రాష్ట్రంలోని వివిధ ప్రముఖ స్థలాలు, ఆలయాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఏటా ఈ డ్రిల్స్ నిర్వహించడం పరిపాటి. ఆక్టోపస్ ఎస్పీ బి.రవిచంద్రన్ పర్యవేక్షణలో డీఎస్పీ బి.కృష్ణ ఆధ్వర్యంలో ఇక్కడ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రదాడి జరిగితే ఎలా వ్యవహరించాలనే దానిపై ఆలయ సిబ్బందికి, సివిల్ పోలీసులకు, రిజర్వు పోలీసులకు, వైద్య సిబ్బందికి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మునికృష్ణారెడ్డి, ఏవీఎస్ఓ నారాయణ, వీఐ వెంకటరమణారెడ్డి, సూపరింటెండెంట్లు నాగరాజు, మోహన్, ఏఈ మురళీమోహన్, ఆక్టోపస్ ఇన్‌స్పెక్టర్లు రాంబాబు, కేవీఎస్.రామకృష్ణ, ఎం.రవిబాబు, శివారెడ్డి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

24 మంది మాజీ సైనికులకు రైల్వేలో ఉద్యోగాలు

-తిరుపతి, రేణిగుంట రైల్వే స్టేషన్లలో విధులు


మాట్లాడుతున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి విజయ శంకర్‌రెడ్డి

తిరుపతి అర్బన్: తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 24 మంది మాజీ సైనికులకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఉద్యోగావకాశాలు కల్పించినట్లు జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్.విజయ శంకర్‌రెడ్డి, రైల్వే ఇన్‌స్పెక్టర్ నిధి మధుసూదన్ తెలియజేశారు. శుక్రవారం తిరుపతి రైల్వే స్టేషన్‌లో 24 మంది మాజీ సైనికులకు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, ఉద్యోగాలు పొందిన మాజీ సైనికులు నిబద్ధతతో పని చేసి సైనిక సంక్షేమ శాఖకు పేరు తేవాలన్నారు. విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ రైల్వే ప్రయాణికులు, వారి వస్తువులకు భద్రత కల్పించాలన్నారు. నియమ నిబంధనలను వివరించారు. సమావేశంలో సైనిక సంక్షేమ శాఖ సీనియర్ అసిస్టెంట్ ప్రమోద్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

- గూడూరు ఏడవ అదనపు జిల్లా జడ్జి సంచలన తీర్పు

గూడూరురూరల్: లారీ డ్రైవర్ హత్య కేసులో నేరం రుజువు కావడంతో గూడూరు ఏడవ అదనపు జిల్లా జడ్జి ముద్దాయిలకు జీవితకాల శిక్షను శుక్రవారం ఖరారు చేస్తూ సంచలన తీర్పును వెల్లడించారు. నాయుడుపేట సీఐ నరసింహారావు కథనం.. ప్రకాశం జిల్లా, పేర్నమిట్టకు చెందిన శేషుకుమార్ లారీ డ్రైవర్. అతను 2015 జూలై 5న గుంటూరుకు చెందిన అవినాష్‌ను క్లీనర్‌గా చేర్చుకుని కేరళకు చేపల లోడ్డుతో వెళ్లాడు. అక్కడ వాటిని డీలర్‌కు అప్పగించి అతని వద్ద నుంచి నగదు తీసుకుని 7వ తేదీ తిరిగి ఇంటికి బయలుదేరాడు. అవినాష్ ఆ నగదును కాజేసేందుకు తన స్నేహితులైన జేష్ట వెంకటేష్, పోనుగంటి సుబ్బరామిరెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. వారు కారులో శ్రీకాళహస్తి వద్ద కాపుకాచి లారీ రావడంతో దానిని వెంబడించారు. ఆ తర్వాత పథకం ప్రకారం డ్రైవర్‌ను నాయుడుపేట–శ్రీకాళహస్తి రోడ్డులో హతమార్చి రోడ్డు పక్కన పొదల్లో వేసి పెట్రోల్ పోసి తగులబెట్టారు. డ్రైవర్ వద్ద ఉన్న రూ 1.3 లక్షల నగదును దోచుకెళ్లారు. అప్పట్లో ఈ హత్య కేసు సంచలనం సృష్టించింది. నాయుడుపేట పోలీసులు సవాల్‌గా తీసుకుని కేసు విచారణ చేపట్టారు. 2015 జూలై 14వ తేదీన నిందితులను పట్టుకుని కోర్టులో హాజరు పరిచారు.

వారి వద్ద నుంచి రూ.74 వేలను రికవరీ చేసినట్లు పోలీసులు కోర్టుకు తెలిపారు. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరుఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుహాసిని వాదించగా వాదోపవాదాలు పూర్తయిన తరువాత గూడూరు ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం సంచలన తీర్పునిచ్చారు. నిందితులకు 14 సంవత్సరాల (జీవిత ఖైదు) శిక్షను విధించారు. అలాగే ఒక్కొక్కరికీ రూ.12 వేల జరిమానా విధించారు.

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం


మాట్లాడుతున్న కలెక్టర్‌వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంజూరైన ప్రతి పరిశ్రమను త్వరితగతిన నెలకొల్పేలా చర్యలు చేపట్టాలన్నారు. దీంతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశముంటుందని వెల్లడించారు. ప్రధాన మంత్రి ఉపాధి కార్యక్రమం కింద అందిన దరఖాస్తుల మేరకు యూనిట్లు మంజూరు చేయాలని స్పష్టం చేశారు.సింగిల్ డెస్క్ విధానంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 550 పరిశ్రమలకుగాను 450 అనుమతులు ఇచ్చినట్లు వివరించారు. మరో 41 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. పరిశీలన కమిటీకి అందిన మేరకు 23 పరిశ్రమలకు ప్రోత్సాహకాల ద్వారా రూ. 1.43 కోట్లు మంజూరుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ నాటికి ఎగుమతులు రూ.4947 కోట్లుగా నమోదైనట్లు తెలిపారు. ఏర్పేడు మండలం మాధవమాలలో క్లస్టర్ అభివృద్ధికి, రేణిగుంట మండలం ఎర్రమరెడ్డిపాళెం వుడ్‌కార్వింగ్ క్లస్టర్, కాపర్ వేజెల్స్ క్లస్టర్, వెంకటగిరి శారీ ప్రింటింగ్ , డైయింగ్ క్లస్టర్, నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్ పురోగతిపై సమీక్షించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కంపెనీల్లో ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నరేంద్రబాబు, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ తిరుపతి డిప్యూటీ జెడ్ఎం జవహర్ బాబు, తిరుపతి స్పెషల్ జోన్ అధికారి విజయరత్నం, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి రమణయ్య పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు జాబితా స్వచ్ఛీకరణ

కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా స్వచ్ఛీకరణ పక్కాగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడ నుంచి ఆయన వీడియా కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఎన్నికల అధికారి మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితాను వందశాతం తప్పులు లేకుండా రూపొందించాలన్నారు. ఈ నెల 2, 3వ తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహించే ప్రత్యేక శిబిరాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు తప్పనిసరిగా బీఎల్ఓలు ఉండాలని ఆదేశించారు. డిసెంబర్ 9 లోపు పెండింగ్ దరఖాస్తులను పూర్తిగా పరిష్కరించాలని కోరారు. అర్హులైన ఒక్క ఓటర్‌ను కూడా జాబితా నుంచి తొలగించరాదని స్పష్టం చేశారు. కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితాలో సిమిలర్ ఓట్ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఈఆర్‌ఓలు హరిత, శ్రీనివాసులు, కోదండరామిరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, కిరణ్ కుమార్, నిశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఉపేంద్ర గాడి అడ్డా' అభిమానుల సందడి


మాట్లాడుతున్న హీరో మిత్రులు, అభిమానులు

తిరుపతి కల్చరల్ : ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ సంస్థ నిర్మాణంలో రూపొందిన చిత్రం ఉపేంద్రగాడి అడ్డా శుక్రవారం తిరుపతి సీఎస్ థియేటర్‌లో రిలీజ్ కావడంతో ఆ సినిమా హీరో మిత్రులు, అభిమానులు సందడి చేశారు. థియేటర్ వద్ద బాణ సంచాలు పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో కంచర్ల ఉపేంద్ర హీరోగా, సావిత్రికృష్ణ హీరోయిన్‌గా కంచర్ల అచ్యుతరావు నిర్మాతగా నిర్మించిన ఉపేంద్ర గాడి అడ్డా చిత్రాన్ని ప్రేక్షకులందరూ ఆదరించి విజయం చేకూర్చాలని కోరారు. హీరో కంచర్ల ఉపేంద్రతో మరో ఆరు సినిమాలు నిర్మాణం జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ సినిమా ద్వారా వచ్చిన డబ్బులతో అనాథలు, ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తూ ఉపేంద్ర అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని వివరించారు. ఏఆర్‌వీ నాగేంద్రకుమార్ భావన, గోపీకృష్ణ, మురళీమోహన్‌రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.